నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 24 డిసెంబర్ 2024 | KHAMMAM


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అప్పటి తెలంగాణ, ఒడిశా ఆర్టీసీ ఉన్నతాధికారులు(ఫైల్)

# కేసీఆర్ సర్కారుకు క్రెడిట్ దక్కకుండా..

- భద్రాచలంలో ఆర్టీసీ అంతర్రాష్ట్ర డిపో ఏర్పాటుపై మౌనం
- గతంలోనే కుదిరిన ఎంవోయూపైనా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఫలితంగా అనేక ఇబ్బందులు పడుతున్న 4 రాష్ట్రాల ప్రయాణికులు
- ఇప్పటికే దూరప్రాంత సర్వీసులను తగ్గిస్తున్న ఆర్టీసీ అధికారులు
- బస్సుల సంఖ్య కుదింపుతో ప్రయాణికులకు పెరుగుతున్న భారం


భద్రాచలం బస్టాండ్ ప్రాంగణం(ఫైల్)

భద్రాచలం, డిసెంబర్ 23 : ప్రజలు అష్టకష్టాలు పడ్డా పర్వాలేదు గానీ.. గత కేసీఆర్ సర్కారుకు మాత్రం క్రెడిట్ దక్కకూడదన్న ధోరణిలో పాలన సాగిస్తోంది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రజోపయోగ పనులపై కేసీఆర్ జాడ కూడా ఉండకూడదన్న అక్కసుతో వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే కేసీఆర్ ఆనవాళ్లు చెరుపుకుంటూ వస్తున్నామంటున్న ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు.. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పనులను కూడా పక్కన పడేస్తున్నారు. ఈ క్రమంలోనే నాలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను నీరుగార్చుతున్నారు. వైద్యం, ఉపాధి, రవాణా వంటి అతి ముఖ్యమైన అంశాల్లో నాలుగు రాష్ట్రాల ప్రజలకు మూలస్తంభంగా ఉన్న తెలంగాణలోని భద్రాచలాన్ని మూలన పడేస్తున్నారు. కేసీఆర్ మీద ఉన్న కక్షతో ప్రజలను, ప్రయాణికులను కష్టాలపాలు చేస్తున్నారు.

భద్రాచలంలో ఆర్టీసీ అంతర్ రాష్ట్ర డిపో ఏర్పాటు కోసం నాలుగు రాష్ట్రాల ప్రజలు, ప్రయాణికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ ఇబ్బందులను గుర్తించిన తెలంగాణలోని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం.. ఒడిశా రాష్ట్ర ఆర్టీసీతో ఒప్పందం కుదుర్చుకుంది. అప్పటి తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ఎండీ సజ్జనార్‌లు ఒడిశా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఎంవోయూ పత్రాలు మార్చుకున్నారు. ఆ తరువాత తెలంగాణలో ప్రభుత్వం మారడంతో ఒప్పందానికి బ్రేక్ పడింది. తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గత కేసీఆర్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను పక్కకు పెట్టింది. దీంతో నాలుగు రాష్ట్రాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## నాలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా..

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రగిరిలోని భద్రాచలం బస్టాండ్ తెలంగాణతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కేంద్ర బిందువుగా ఉంది. నాలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా బస్సు సేవలను అందిస్తూ ప్రయాణికులకు చేరువైంది. ఏటా ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాల సమయంలో భద్రాద్రికి వచ్చి వెళ్లే భక్తులకు సేవలందిస్తోంది. ఇక ఆయా రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంత గిరిజనులు వైద్యసేవలు, ఇతర అవసరాలకు భద్రాచలమే ప్రధానం కావడంతో ఆయా రాష్ట్రాల నుంచి బస్సుల రాకపోకలు అధికం, అనివార్యం అయ్యాయి. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వ చొరవ లేకపోవడం, సరైన సర్వీసులు రాకపోవడం వంటి కారణాలతో అంతర్రాష్ట్ర డిపో గుర్తింపు అంశం.. ఆయా రాష్ట్రాల ప్రజల కలగానే మిగిలిపోయింది. దీంతో నాలుగు రాష్ట్రాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. వీరి ఇబ్బందులను ఆసరా చేసుకుంటున్న ప్రైవేటు బస్సుల యజమానులు తెలంగాణ ఆర్టీసీ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు.

## కేసీఆర్‌పై కోపం.. ప్రజలకు శాపం..

అంతర్రాష్ట్ర డిపో ఏర్పాటు విషయంలో ముందుండి చొరవ తీసుకోవాల్సిన తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో చేసుకున్న ఒప్పందాలపై ముందుకెళ్లడం లేదు. ఒకవేళ గత ప్రభుత్వ ఎంవోయూలను అమలు చేస్తే ఆ ఘనత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చెందుతుందన్న కారణంతోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుకు ముందడుగు వేయడం లేదని రాజకీయ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. కానీ.. గత కేసీఆర్ ప్రభుత్వంపై ఉన్న కోపంతో తమనెందుకు ఇబ్బందులు పాలు చేస్తున్నారంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. అందుకే గతంలో తెలంగాణ, ఒడిశా ఆర్టీసీ సంస్థలు చేసుకున్న ఒప్పందాలు కేవలం పత్రాలకే పరిమితమయ్యాయని ఆరోపిస్తున్నారు.

## సర్వీసులు తగ్గిస్తూ..

భద్రాచలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులను క్రమంగా తగ్గిస్తుండడంతో ప్రగతి రథచక్రాలు ప్రయాణికులకు దూరమవుతున్నాయి. భద్రాచలం మద్రాసుకు గతంలో ఉన్న సర్వీసును రద్దు చేశారు. బెంగళూరుకు బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నా స్పందన లేదు. మరోపక్క హైదరాబాద్‌కు ఇటీవల ఏసీ స్లీపర్ బస్సులను ప్రవేశపెట్టినా ప్రయాణికుల రద్దీకి తగిన సంఖ్యలో సర్వీసులు ఉండడంలేదు. భద్రాచలం-హైదరాబాద్ సర్వీసులను సైతం చాలావరకు కుదించారు. హైదరాబాద్‌లో మెట్రో రైలుకు ఆదరణ పెరిగిందనే కారణంతో కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్ వరకు నడిపే బస్సులను ఎంజీబీఎస్ వరకే పరిమితం చేశారు.

# తెలంగాణ స్వరూపాన్ని మారుస్తామని చెప్పి.. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చారు

- అసలైన తెలంగాణ తల్లినే మనం గౌరవించుకోవాలి
- జడ్పీ, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్లు లింగాల, కొండబాల
- బోనకల్లులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం


తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కొండబాల, లింగాల

బోనకల్లు, డిసెంబర్ 23: తెలంగాణ రాష్ట్ర స్వరూపాన్ని మారుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు.. చివరికి తెలంగాణ తల్లి విగ్రహ స్వరూపాన్ని మార్చారని జడ్పీ, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కొండబాల కోటేశ్వరరావు విమర్శించారు. తెలంగాణ అస్తిత్వానికి, ఉద్యమానికి స్ఫూర్తిగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం దుర్మార్గమని అన్నారు. అసలైన తెలంగాణ తల్లి విగ్రహాన్నే మనం గౌరవించుకుందామని పిలుపునిచ్చారు. బోనకల్లు మండలం నారాయణపురం గ్రామంలో సోమవారం పర్యటించిన వారు.. స్థానిక యువకులు, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి అక్కడి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమం సమయంలో ఊరూరా తెలంగాణ తల్లి విగ్రహాలను నిర్మించుకున్నామని, ఆ విగ్రహాల స్ఫూర్తితో ఉవ్వెత్తున ఉద్యమించి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని వివరించారు. కానీ ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ పాలకులు తమ స్వార్థం కోసం తెలంగాణ విగ్రహ రూపాన్ని మార్చారని విమర్శించారు. అలాగే, ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటిల్లోని ఏ ఒక్క హామీనీ అమలుచేయలేకపోయిందని దుయ్యబట్టారు. ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించి కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు బంధం శ్రీనివాసరావు, వేమూరి ప్రసాద్, కొండా, మోదుగుల నాగేశ్వరరావు, కాకాని శ్రీనివాసరావు, ఇటికాల శ్రీనివాసరావు, పారా ప్రసాద్, గద్దల వెంకటేశ్వరరావు, కనకయ్య, జెర్రిపోతుల రవీందర్, కొనకంచి నాగరాజు, కంచర్ల అచ్చయ్య, యనమద్ది శ్రీను, వల్లెబోయిన కొండ, చిట్టిమోదు శ్రీనివాసరావు, వీరబాబు, బాబు, రాధాకృష్ణ, రూబీన్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఆడి.. నిరసన తెలిపి..

## 13వ రోజు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె


బతుకమ్మ ఆడుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 23 : విద్యాశాఖ సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 13వ రోజుకు చేరింది. సోమవారం ఉద్యోగులందరూ బతుకమ్మ ఆడి కలెక్టరేట్ గేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పాషా, జాన్సీసౌజన్య మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యల మీద వెంటనే స్పందించి చర్చకు పిలవాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లో అనాథ, పేదపిల్లలు గత 15 రోజుల నుంచి బోధనకు దూరంగా ఉంటున్నారన్నారు. ప్రధాన డిమాండ్ అయిన పే స్కేల్‌ను ప్రకటించి న్యాయం చేయాలని కోరారు. అనిల్, నిర్మల, విజయలక్ష్మి, రాణి, ఇస్మాయిల్, నాగేంద్రబాబు, మదార్ పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

## సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్


ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేజీబీవీ విద్యార్థినుల తల్లిదండ్రులు

రఘునాథపాలెం, డిసెంబర్ 23 : సమగ్ర శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేజీబీవీల్లో చదివే విద్యార్థినుల తల్లిదండ్రులతో కలిసి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయులు 13 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. విద్యార్థినులకు వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో వారి చదువులకు ఇబ్బంది కలగకుండా.. ఆయా సంఘాల రాష్ట్ర నాయకులను చర్చలకు పిలిచి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు సంధ్య, పుష్పావతి, సౌజన్య, పావని, సరస్వతి, సామ్రాజ్యం, యేసయ్య, వెంకన్న, రామకృష్ణ, ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

# అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

## ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు బాలమాయాదేవి


మాట్లాడుతున్న పరిశీలకులు బాలమాయాదేవి

మామిళ్లగూడెం, డిసెంబర్ 23 : 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు బాలమాయాదేవి అన్నారు. కలెక్టరేట్‌లో ఓటరు సవరణ జాబితా-2025పై ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి అధికారులతో సోమవారం సమీక్షించారు. ఓటరు జాబితా సవరణ-2025పై జిల్లాలో చేపడుతున్న చర్యల గురించి వివరించారు. అనంతరం పరిశీలకులు మాట్లాడుతూ ఓటరు జాబితాలో కొత్తగా నమోదవుతున్న వారి వివరాలను ర్యాండంగా చెక్ చేయాలని సూచించారు. జాబితాకు సంబంధించి వచ్చిన ప్రతి అభ్యంతరం, క్లెయిమ్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ 2025 పూర్తి పారదర్శకంగా జరగాలని, ప్రతి కార్యక్రమంలో పార్టీల ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లాలో డ్రాఫ్ట్ ఓటరు జాబితా సందర్భంగా ఫారం-6, 6ఏ, 7, 8 దరఖాస్తులు 21,274 రాగా.. ఇప్పటివరకు 18,192 దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. మరో 2,977 దరఖాస్తులు తిరస్కరించగా.. 105 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రత్యేక ప్రచారంలో జిల్లావ్యాప్తంగా 1,181 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సమావేశంలో డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారానికి చొరవ చూపండి

## అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ

మామిళ్లగూడెం, డిసెంబర్ 23 : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన బి.రవి, రఘునాథపాలెం మండలం బూడిదెంపాడు గ్రామానికి చెందిన కె.శిల్ప తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

# దాచినా ధర దక్కలే..!

- కొత్త, పాత మిర్చికి ఖమ్మం ఏఎంసీలో ఒకే రేటు
- నిల్వ చేసిన రైతులు, వ్యాపారులకు తీరని నష్టం
- కొత్త మిర్చి క్వింటా ధర రూ.16,200 మాత్రమే..


ఖమ్మం ఏఎంసీకి రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు(ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 23 : జిల్లాలోని మిర్చి సాగు రైతులకు, వ్యాపారులకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఈ ఏడాది వింత అనుభవం ఎదురవుతున్నది. సాధారణంగా అన్ సీజన్‌లో ఏసీలో నిల్వ పెట్టుకున్న మిర్చి పంటకు.. సాధారణ పంట కంటే డబుల్ రేటు పలుకుతుంది. కానీ.. ప్రస్తుతం కొత్త మిర్చి పంటకు, ఏసీ రకం మిర్చి పంటకు ఒకే ధర పలుకుతుండడంతో రైతులు, వ్యాపారుల్లో ఆందోళన నెలకొన్నది. గత ఏడాది పంట చేతికొచ్చే సమయంలో మార్కెట్లో సాధారణ పంట ధర క్వింటా రూ.18 వేల నుంచి రూ.20 వేలు పలికింది. అయితే అప్పటికే కోల్డ్ స్టోరేజీలలో నిల్వలు పూర్తిగా తగ్గిపోవడంతో రాబోయే రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం ఉందని కొందరు రైతులతోపాటు అనేక మంది మిర్చి ఖరీదుదారులు రైతుల వద్ద పంట కొనుగోలు చేసి నిల్వ పెట్టుకున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా 38 కోల్డ్ స్టోరేజీలలో సుమారుగా 40 లక్షల బస్తాలను నిల్వ చేశారు. మరికొందరు రైతులు భవిష్యత్ సంగతి ఎలా ఉంటుందో అంచనా వేయలేమనే ఉద్దేశంతో తమ సరుకును అమ్ముకున్నారు. సీన్ కట్ చేస్తే.. ఏడెనిమిది నెలల తర్వాత ప్రస్తుతం ఏసీ రకం పంటకు క్వింటా గరిష్ఠ ధర రూ.16,625 పలుకుతున్నది. దీంతో క్వింటా ఒక్కంటికి రూ.3 వేల నుంచి రూ.4 వేలు ధర తగ్గడంతోపాటు అదనంగా కోల్డ్ స్టోరేజీలకు కిరాయి చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నది. మార్కెట్ పరిధిలోని 3-4 పెద్ద ఖరీదుదారులు రూ.కోట్లలో నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి దాపురించింది. నిల్వ చేసుకున్న రైతులకు సైతం లక్షల్లో నష్టం వాటిల్లింది. ప్రస్తుతానికి కొత్త పంట మార్కెట్‌కు వస్తుండడంతో విధిలేని పరిస్థితుల్లో మూడు, నాలుగు రోజుల నుంచి భారీగా ధర తగ్గినప్పటికీ మరింత పడిపోతుందా.. అనే ఉద్దేశంతో సరుకును అమ్మకానికి పెడుతున్నారు. కొత్త పంటకు సైతం ప్రస్తుతం క్వింటా గరిష్ట ధర కేవలం రూ.16,200 మాత్రమే పలుకుతున్నది. సీజన్ నాటికి ఈ ధర ఇలానే ఉంటుందా? మరింత పడిపోతుందా? అనే ఆందోళనలో మిర్చి రైతులు ఉన్నారు.

# 'పాలేరు'ను పరిశీలించిన ఇరిగేషన్ ఈఎన్‌సీ



పాలేరును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈ విద్యాసాగర్, ఎస్ఈ మంగళంపూడి, బస్వరాజు

కూసుమంచి, డిసెంబర్ 23: జిల్లాకు సాగర్ జలాలను అందించే పాలేరు రిజర్వాయర్‌ను ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ సోమవారం పరిశీలించారు. గత సెప్టెంబర్‌లో వచ్చిన వరదల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను ఈ సందర్భంగా ఈఎన్‌సీ పరిశీలించి.. మరమ్మతుల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో విపత్తులు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వివరించారు. అలాగే, గతంలో జరిగిన నష్టం అంచనాల గురించి సీఈ విద్యాసాగర్, ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. నాయకన్‌గూడెం ఇన్‌ఫాల్ కాలువ రంగుల బ్రిడ్జి వద్ద పడిన గండితోపాటు పాలేరు అలుగుల వద్ద జరిగిన నష్టం, ప్రధాన కాలువకు గండి పడిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ.. వర్షాలు, వరదల వల్ల రైతులకు ఇలాంటి నష్టమూ వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు అనన్య, రమేశ్‌రెడ్డి, మన్మథరావు, రత్నకుమారి పాల్గొన్నారు.

# ఖమ్మంలో క్రిస్మస్ సందడి

- కిటకిటలాడుతున్న షాపులు
- విద్యుద్దీపాలతో ముస్తాబైన చర్చిలు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఖమ్మం నగరంలో ఎక్కడ చూసినా సందడి.. సందడిగా మారింది. చర్చిలన్నీ రంగురంగుల విద్యుత్‌దీపాలు, స్టార్స్‌తో ముస్తాబయ్యాయి. బుధవారం జరుగనున్న క్రిస్మస్ వేడుకల కోసం కేకులు ఆర్డర్ ఇచ్చేందుకు స్వీటు షాపులు కిటకిటలాడాయి. క్రైస్తవుల షాపింగ్‌తో వస్త్ర దుకాణాలు నిండిపోయాయి. నగరంలోని కమాన్‌బజార్, కస్బా బజార్, వైరారోడ్, ఇల్లెందు రోడ్డు, ఎన్ఎస్‌టీ రోడ్డు, స్టేషన్‌రోడ్డులోని ఫ్యాన్సీషాపుల్లో క్రిస్మస్ ట్రీ, స్టార్స్, డెకరేషన్ మెటీరియల్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పలుచోట్ల ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. - ఖమ్మం, డిసెంబర్ 23



విద్యుత్ కాంతుల్లో వైరా రోడ్‌లోని ఆర్‌సీఎం, చర్చి కాంపౌండ్‌లోని సీఎస్ఐ చర్చి





పండుగ కోసం క్రిస్మస్ ట్రీ, స్టార్స్, డెకరేషన్ మెటీరియల్ కొనుగోలు చేస్తున్న క్రైస్తవులు

